RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు


జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | మంగళవారం | 09 -01 - 2024

సంపుటి: 1 | సంచిక : 235 | పేజీలు : 4 | వెల : 5/-


## ముగ్గురికి ముగ్గురు! ఆపై మరో ఇద్దరు!!



3లో






- ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం
- కొనసాగుతున్న అర్జీల ఆన్‌లైన్ ప్రక్రియ
- అనంతరం ఇంటింటికి వెరిఫికేషన్ టీం
- ప్రజాపాలన అమలుకు సబ్ కమిటీ
- చైర్మన్‌గా డిప్యూటీ సీఎం విక్రమార్క
- సభ్యులుగా దుద్దిళ్ల, పొన్నం, పొంగులేటి
- ప్రజాపాలన దరఖాస్తులపై సీఎం రేవంత్ సమీక్ష

# వెరిఫికేషన్‌ను భట్టి..!

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** గత నెల 28 తేదీనుండి ఈనెల 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన లో అందిన దరఖాస్తుల పరిశీలన, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై సోమవారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి లతో పాటు వివిధ శాఖలకు చెందిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేకంగా నియమించిన నోడల్ అధికారులు, సి.జి.జి డైరెక్టర్ జనరల్, జీహెచ్ఎంసీ కమిషనర్ తదితర ఉన్నతాధికారులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రజాపాలన పై ప్రత్యేకంగా రూపొందించిన వెబ్-సైట్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

**మొత్తం1,25,84,383 దరఖాస్తులు**

ప్రజాపాలనా జరిగిన పదిరోజుల్లో మొత్తం 1,25,84,383 దరఖాస్తులు అందాయి. వీటిలో ఐదు గ్యారేటీలకు సంబంధించి 1,05,91,636 దరకాస్తులు కాగా, ఇతర అభ్యర్ధనలకు సంబంధించి 19 ,92 ,747 ఉన్నాయి. రాష్ట్రంలోని 16 , 392 గ్రామ పంచాయితీలు, 710 మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించగా, ఈ గ్రామ సభల్లో 1,11,46,293 మంది పాల్గొన్నారు. ఈ ప్రజాపాలనలో మొత్తం 3 ,714 అధికార బృందాలు పాల్గొని దరఖాస్తుల స్వీకరణకు

మిగతా 2వ పేజీలో...

# ఆ పథకాల పేరద్దు..



- దళితబంధు, గృహలక్ష్మికి రేవంత్ సర్కారు మంగళం
- గొర్రెల పంపిణీ స్కీమూ రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- సంక్షేమ పథకాల తొలగింపు సరికాదంటున్న గులాబీదళం
- ప్రజలకు అన్యాయం జరిగితే ఊరుకోమని హెచ్చరికలు
- పార్లమెంటు ఎన్నికల వేళ రాజకీయాంశంగా కాంగ్రెస్ తీరు



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** ప్రజలకు లబ్ధి కలిగిస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ మేరకు ఆ పార్టీ ముఖ్య నేతలు కేటీఆర్, హరీశ్ రావు ప్రకటన చేశారు. ప్రజలకు లబ్ధి కలిగించే సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేయటాన్ని ఖండిస్తూ నిరసనలు చేపడుతామని చెప్పారు. గృహలక్ష్మి, దళిత బంధు, గొర్రెల పంపిణీ వంటి లబ్ధిదారుల తరఫున ప్రభుత్వం పైన ఒత్తిడి తెస్తామన్నారు. దళిత బంధు, గొర్రెల పంపిణీ రద్దు చేయడం అంటే బలహీనవర్గాలకు, దళితులకు తీరని ద్రోహం చేసినట్లే అని కేటీఆర్, హరీశ్ రావు అన్నారు. పట్టణాలకు గత ప్రభుత్వం కేటాయించిన నిధులు, ఆర్ అండ్ బి, పంచాయితీ రాజ్ రోడ్ల వంటి అభివృద్ధి కార్యక్రమాలను కూడా రద్దు చేస్తున్నదని విమర్శించారు. శుక్రవారం పార్టీ శాసనసభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ఇంఛార్జిలతో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్, హరీశ్ రావు మాట్లాడారు."కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ ప్రారంభించిన అనేక పథకాలను కేవలం రాజకీయ అక్కసుతో రద్దు చేసుకుంటూ వెళుతోంది. గత పది సంవత్సరాలలో లక్షలాదిమందికి ఉపయోగపడి, వారి జీవితాల్లో మార్పు తెచ్చిన కార్యక్రమాలను సైతం కేవలం రాజకీయ దురుద్దేశంతో పక్కన పెడుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఏ పార్టీ ఉన్న, ప్రభుత్వం అనే వ్యవస్థ శాశ్వతం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు గత ప్రభుత్వం అనుమతులు, నిధులు ఇచ్చిన రోడ్లు, భవనాల వంటి ప్రజా ప్రయోజన మౌలిక వసతులను సైతం రద్దు చేసే-స్తున్నది. ఇప్పటికే గృహలక్ష్మి కార్యక్రమాన్ని రద్దు చేస్తూ జీవో ఇచ్చింది. అయితే గృహలక్ష్మి కార్యక్రమంలో

మిగతా 2వ పేజీలో...

## కిడ్నాప్ కథలో అక్కే విలన్


- సురేందర్ కిడ్నాప్ కేసు సుఖాంతం
- కర్నూలులో నిందితులు అరెస్ట్
- కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు



2లో

# నల్లగొండలో నెగ్గిన అవిశ్వాసం

- విశ్వాసం కోల్పోయిన మునిసిపల్ చైర్మన్ మందడి
- అవిశ్వాసానికి అనుకూలంగా 41మంది మద్దతు
- తీర్మానానికి వ్యతిరేకంగా ఐదుగురు సభ్యులు ఓటు
- చైర్మన్ పదవి కోల్పోయిన బీఆర్ఎస్ నేత సైదిరెడ్డి
- కోదాడ ఎంపీపీ పీఠం కూడా ఖాళీ.. కవిత రాజీనామా



**నల్లగొండ, ప్రభాతసూర్యుడు :** నల్లగొండ మున్సిపాలిటీని హస్తం పార్టీ కైవసం చేసుకోనుంది. బీఆర్ఎస్ చెందిన మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మెజారిటీ సభ్యులు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడంతో తీర్మానం నెగ్గింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన 9 మంది కౌన్సిలర్లు, ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరిన మరో ఆరుగురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు పెట్టి తీర్మానం నెగ్గింది.నల్లగొండ మున్సిపాలిటీని హస్తం పార్టీ కైవసం చేసుకోనుంది. బీఆర్ఎస్ చెందిన మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మెజారిటీ సభ్యులు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడంతో తీర్మానం నెగ్గింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన

మిగతా 3వ పేజీలో...

## బిల్కినో కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు



**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** గుజరాత్ కు చెందిన బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసుల్లో దోషులైన 11 మందిని జైలు నుంచి ముందుగానే విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ పై విచారించిన సర్వోన్నత న్యాయస్థానం.. గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని సస్పెండ్

మిగతా 2వ పేజీలో...

## పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ ఫోకస్

- తెలంగాణలో ఎంపీ స్థానాలపై నజర్
- నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌ల ఎంపిక
- 8మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీకి బాధ్యతలు



2లో

# ఒక్కటే చాలదా!

- ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్లపై బీఆర్ఎస్ అభ్యంతరం
- రెండు స్థానాలకు వేర్వేరుగా ఎందుకని ఈసీకి ప్రశ్న
- ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాయనున్న గులాబీదళం



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు వేరు వేరుగా ఎన్నికల నిర్వహణపై ఈసీకి లేఖ రాయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీకి లబ్ధి చేకూరేలా అధికారుల తీరు ఉందని.. షెడ్యూల్ వేర్వేరుగా ఇవ్వడం ఎందుకని గులాబీ నేతలు ప్రశ్నిస్తున్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు వేరువేరుగా షెడ్యూల్ ఇవ్వడంపై ఈసీకి లేఖ రాయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, హైకోర్టు న్యాయవాది భరత్, ఇతర లీగల్ సెల్ సభ్యులతో కలిసి చర్చించి ఎన్నికల అధికారులకు లేఖ సమర్పించాలని నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్సీలుగా ఉన్న కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 2021 నవంబర్‌లో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి పదవీ కాలం 2027 నవంబర్ వరకు ఉంది. కానీ ఎమ్మెల్యేలుగా గెలిచిన వెంటనే ఇద్దరు తమ ఎమ్మెల్సీ

మిగతా 2వ పేజీలో...

# ఇది ప్రభుత్వ స్థలం!

- ఖమ్మంలో వెలుస్తున్న బోర్డులు
- సర్కారీ స్థలాలకు కంచె ఏర్పాట్లు
- రెవెన్యూ శాఖ పకడ్బందీ చర్యలు




**ఖమ్మం, ప్రభాతసూర్యుడు :** ఖమ్మంలో సర్కార్ భూముల పరిరక్షణకు ప్రభుత్వ యంత్రాంగం ముందుకు కదిలింది. నిర్మాణాలు లేకుండా జీవో 58, 59 ప్రకారం ఆక్రయించిన భూములను గుర్తించి వాటికి ఫెన్సింగ్ వేస్తున్నారు అధికారులు ఖమ్మంలో సర్కారు భూముల పరిరక్షణకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా తెలంగాణ వ్యాప్తంగా విలువైన భూములను అన్యాక్రాంతం అయ్యాయన్న ఆరోపణలు లేకపోలేదు. 58, 59 జీవోను ఆసరాగా చేసుకుని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులే అడ్డగోలుగా ఆక్రమణలకు బరితెగించిన వైనం తాజాగా వెలుగు చూసింది. ఖమ్మం నియోజకవర్గంలో ఇటీవల పగడాల శ్రీవిద్య(భర్త నాగరాజు) కార్పొరేటర్ 415 గజాల ప్రభుత్వ స్థలానికి దరఖాస్తు చేసి అధికారులను మభ్యపెట్టి, మాయచేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైనం వెలుగు చూసింది. అలాగే

మిగతా 3వ పేజీలో...

## మద్యం మత్తులో మాజీ మంత్రి మేనల్లుడి వీరంగం

- రాంగ్‌రూట్‌లో కారు డ్రైవింగ్
- బైక్‌ను ఢీకొట్టి హల్‌చల్



4లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# అయోధ్యకు శ్రీరామ ప్రసాదం



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** శ్రీరామ ప్రసాదాన్ని అయోధ్య కు విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ పంపించింది. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని శ్రీ నాగ లక్ష్మి మాత దేవాలయం నుంచి అయోధ్య ధామానికి వెళ్లే ప్రసాద సామగ్రి వాహనాన్ని... విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, దాతలు జెండా ఊపి ప్రారంభించారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ద్వారా దాతల సహాయంతో నిత్యం అన్నదానం చేసేందుకు 45 రోజుల పాటు నిత్యం 5000వేల మందికి భోజన ఏర్పాట్లు చేసినట్లు... విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి రామరాజు తెలిపారు. అయోధ్యలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ద్వారా నిత్యం అన్నదానం చేసేందుకు కమిటీని కేటాయించినట్లు తెలిపారు. 14 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 28 వరకు దాదాపు 45 రోజుల పాటు ఈ కార్యక్రమం ప్రతిరోజూ అయోధ్యను సందర్శించే... దాదాపు 5000 మంది భక్తులకు రోజువారీ భోజనాన్ని అందజేస్తుందన్నారు. భాగ్యనగర్ నుండి దాదాపు 150 మంది విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ కార్యకర్తలు... ఈ ప్రయోజనం కోసం అయోధ్యకు వాలంటీర్లుగా వెళ్తున్నారని తెలిపారు.



# కిడ్నాప్ కథలో అక్కే విలన్

- సురేందర్ కిడ్నాప్ కేసు సుఖాంతం
- కర్నూలులో నిందితులు అరెస్ట్
- కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** హైదరాబాద్ రాయదుర్గంలో సంచలనం రేపిన కిడ్నాప్ కథ సుఖాంతమైంది. కిడ్నాపర్ల చెర నుంచి బాధితుడు సురేందర్‌ను సేఫ్‌గా కాపాడారు పోలీసులు. ఈ ఎపిసోడ్‌లో కథ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ ఎవరిది? ఎన్ని కోట్ల రూపాయలు రాబట్టేందుకు ప్లాన్ చేశారు? అనే వివరాలను హైదరాబాద్ పోలీసులు వెల్లడించారు. రాయదుర్గంలో ప్రైవేట్ ఎంప్లాయ్ సురేందర్ ఈనెల 4న కనిపించకుండాపోయాడు. కంగారుపడ్డ కుటుంబసభ్యులు అయినవాళ్ల దగ్గర ఆరాతీశారు. అయితే, ఆగంతకులు కాల్ చేసి 2కోట్ల రూపాయలు డిమాండ్ చేయడంతో.. అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగానే.. కాజాగూడ చెరువు దగ్గర సురేందర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో గుర్తించారు. మొబైల్ నంబర్, వాట్సప్ ఆధారంగా కుటుంబసభ్యులతో కాల్ మాట్లాడినట్టు గుర్తించారు. ఆ తర్వాత తన మొబైల్ ఫోన్ ఆఫ్ చేసి.. వైఫైతో మాట్లాడినట్టు ఐడెంటిఫై చేశారు. అయితే సురేందర్ ఎక్కడున్నాడనే దానిపై క్లారిటీ రాలేదు. కిడ్నాప్ సమయంలో సురేందర్‌తో పాటు ఉన్న మరో వ్యక్తి నుంచి కూడా సమాచారం రాబట్టారు. ఈ క్రమంలోనే కిడ్నాపర్లు ఓ కారులో.. కర్నూలు జిల్లా ఆత్మకూరు సమీపంలో ఉన్నట్టు అక్కడి ఫారెస్ట్ సిబ్బంది గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. అప్పటికే సురేందర్‌ను వదిలేసి పారిపోయారు. నిందితులు సురేష్.. సహా.. ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని విచారించగా ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. కిడ్నాపర్ సురేష్‌తో సురేందర్ సోదరి 2కోట్ల రూపాయల కోసం కిడ్నాప్ డ్రామా ఆడినట్టు తేల్చారు. మొదట.. సురేందర్‌ను రాయదుర్గం పిలిపించి కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత సురేందర్‌ను కిడ్నాపర్లు నల్లమలకు తీసుకెళ్లారు. కర్నూలు జిల్లా ఆత్మకూరు దగ్గర.. కిడ్నాప్ చేసిన కారును ఫారెస్ట్ సిబ్బంది అందించిన సమాచారంతో అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఆమెను వేర్వేరు కోణాల్లో విచారిస్తున్నారు. పరారీలో ఉన్న మరొకరి కోసం గాలిస్తున్నారు.

# నిజామాబాద్‌లో మనమే గెలవాలి



**నిజామాబాద్, ప్రభాతసూర్యుడు :** 2023 అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ సరళి పరిశీలిస్తే నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ గెలిచే అవకాశాలు ఎక్కువ ఉన్నాయన్నారు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. తెలంగాణ భవన్‌లో నిజామాబాద్ లోక్‌సభ స్థానం సన్నాహక సమావేశంలో మాట్లాడిన కేటీఆర్... కీలక వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అమలు సాధ్యం కానీ హామీలు ఇచ్చి విజయం సాధించిందని విమర్శించారు. ఇప్పుడు వాటి అమలు చేయలేక సాకులు వెతుకుతోందన్నారు. నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ సరళి పరిశీలిస్తే బిఆర్ఎస్ పార్టీ ఓట్ల వారిగా నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో మొదటి స్థానంలో ఉందన్నారు కేటీఆర్. కాంగ్రెస్, బీజేపీ కన్నా బీఆర్ఎస్ ముందు వరుసలో ఉందని తెలిపారు. అయితే రాజకీయ పరిణామాలు చూస్తే లోక్‌శభ ఎన్నికల్లో త్రిముఖ పోరు ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ ఫలితాలతో సంబంధం లేకుండా తెలంగాణ ప్రజల ప్రయోజనాల ప్రాతినిధ్యం కోసం గట్టిగా కష్టపడాలన్నారు కేటీఆర్. రానున్న ఎన్నికల్లో కొట్లాడితే లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. భారత రాష్ట్ర సమితికి ఎన్నికల్లో గెలుపు ఓటములు కొత్త కాదని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలవడానికి అడ్డగోలుగా ఇచ్చిన హామీల సంఖ్య 6 గ్యారంటీలు కాదని 420 హామీలని విమర్శించారు కేటీఆర్. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ పలు హామీలపైన మాట దాటేస్తోందని ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా నిరుద్యోగ భృతి ఇవ్వలేమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. అప్పులు, శ్వేత పత్రాల పేరుతో తప్పించుకునే డ్రామాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజల కోసం ఉద్దేశించిన అనే సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ రద్దు చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు కేటీఆర్. ఇప్పటికే నియోజకవర్గానికి 3,000 మందికి ఇచ్చిన గృహ లక్ష్మి లబ్ధిదారుల ప్రయోజనాలను పట్టించుకోకుండా ఆ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని ప్రకటించిందని తెలిపారు.

దళిత బంధు లబ్ధిదారుల ఎంపిక పూర్తయిన తర్వాత దానిపైన స్పందించడం లేదని వెల్లడించారు. దళిత బంధు, బిసి బంధు, గృహలక్ష్మి ఇలా ఇతర సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేస్తే ఆయా లబ్ధిదారులతో కలిసి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. పేదలు, దళితులు, బీసీల ప్రయోజనాలకు దెబ్బకొట్టేలా కుట్ర చేస్తే ఊరుకోబోమన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రతిరోజు ఎంతమంది రైతులకు డబ్బులు వారి ఖాతాల్లో వేశామో ప్రజలకి అధికారికంగా వివరించే వాళ్లమని తెలిపారు కేటీఆర్. కానీ రైతుబంధు డబ్బులు వేయకుండా, కాంగ్రెస్ ఇప్పుడు మభ్య పెట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. ఈ సంక్షేమ తెలంగాణలో ప్రభుత్వ పథకానికి ప్రజలను లైన్లలో నిలబెట్టి అందించిందో ప్రజలు ఆలోచించాలన్నారు కేటీఆర్. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇబ్బంది పెట్టేలా లైన్లో నిలబెట్టే దుస్థితికి కాంగ్రెస్ తీసుకువచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అస్తవ్యస్త పనితీరును, పరిపాలనను ఎప్పటికప్పుడు ఎండగట్టేలా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. ఎన్నికల్లో పార్టీ పని తీరుపరంగా కూడా కొన్ని మార్పు చేర్పులు అవసరం అన్నారు కేటీఆర్. పార్టీ కార్యకర్తగా ఆకాంక్షలకు అనుగుణంగా కచ్చితంగా మార్చుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసం ఢిల్లీలో గులాబీ జెండా ప్రాతినిధ్యం ఉండాల్సిందేనన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడేది గతంలో ఆయన ఇప్పుడైనా భవిష్యత్తులో అయినా భారత రాష్ట్ర సమితి మాత్రమే అన్నారు.

# ఆ పథకాల పేరద్దు..

**మొదటిపేజీ తరువాయి..**

భాగంగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి అయి అధికారిక పత్రాలు అందుకున్న వారి పరిస్థితి ఏంటో ప్రభుత్వం తెలియజేయాలి. ఇప్పటికే లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన అధికారిక పత్రాలు ఆధారంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల ప్రయోజనాలకు లబ్ధి కలిగించే ఏ కార్యక్రమాన్ని వ్యతిరేకించినా, రద్దు చేసినా బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిలబడుతుంది. దీంతోపాటు గొర్రెల పంపిణీ ద్వారా లక్షలాదిమంది యాదవుల కుటుంబాల్లో ఆర్థిక భరోసా కలిగింది. ఇలాంటి కార్యక్రమాన్ని కూడా రద్దు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తున్నది. బలహీన వర్గాల్లో కీలకమైన యాదవ సామాజిక వర్గానికి ఆర్థిక భరోసా కలిగించే ఈ కార్యక్రమాన్ని రద్దు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తాము. ఇప్పటికే ఈ పథకంలో భాగంగా తమ వాటాగా చెల్లించాల్సిన డిడిలు కట్టిన వారికి వెంటనే ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేయాలి. దళిత బంధు కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం రద్దు చేయాలని ఆలోచిస్తున్నది. ఎన్నికల్లో దళిత బంధు కార్యక్రమాన్ని మరింతగా విస్తరించి 12 లక్షలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీకి కట్టుబడి, ఇప్పటికే ఎంపికైన లబ్ధిదారులకు దళిత బంధు ప్రకారం 10 లక్షలైనా ఇవ్వాలి లేదా కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు 12 లక్షల రూపాయలైనా వెంటనే అందించాలి. దళిత బందుకు ఎంపికైన వారికి వెంటనే నిధులు చెల్లించి వారి యూనిట్లు ప్రారంభం అయ్యేలా చూడాలి" అని కేటీఆర్, హరీశ్ రావు డిమాండ్ చేశారు.సంక్షేమ కార్యక్రమాల అమలుపైన కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో లబ్ధిదారులకు అండగా నిలబడేలా నిరసన కార్యక్రమాలను పార్టీ తరఫున చేపడుతామన్నారు కేటీఆర్, హరీశ్ రావు. "లబ్ధిదారుల కోసం పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్చార్జిలు ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచిస్తున్నాం. కేవలం సంక్షేమ కార్యక్రమాలను మాత్రమే రద్దు చేయడం కాకుండా... గత ప్రభుత్వం పట్టణాలకు, గ్రామాలకు మంజూరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా ఈ ప్రభుత్వం రద్దు చేసస్తున్నది. మునిసిపాలిటీలకు టియుఎఫ్ఐడిసి, ఇతర సంస్థల ద్వారా శాఖ ద్వారా అందించిన అభివృద్ధి నిధుల మంజూరిని రద్దు చేస్తున్నది. ఇప్పటికే ఈ నిధులకు సంబంధించిన టెండరింగ్ ప్రక్రియ ప్రారంభం కూడా అయింది. రోడ్లు, భవనాలు, ఇతర పౌరవసతుల కార్యక్రమాలు ప్రారంభం కావాల్సి ఉన్న నేపథ్యంలో వీటిని రద్దు చేయడం దుర్మార్గం. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి రోడ్ల మంజూరు ని కూడా ఈ ప్రభుత్వం రద్దు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నది. ఇలా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేసుకుంటూ వెళుతున్న తీరుపైన ప్రజలను మరింత చైతన్యవంతం చేయాలి" అని ఇద్దరు నేతలు దిశానిర్దేశం చేశారు.



# పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ ఫోకస్

## నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌ల నియామకం

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలో సోమవారం నాడు పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇంచార్జ్ లను నియమించింది. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీకి పార్లమెంట్ ఇంచార్జ్ లుగా బాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్ ఇంచార్జ్ గా గోషామహాల్ ఎమ్మెల్యే రాజసింగ్ కు బాధ్యతలు ఇచ్చారు. ఆదిలాబాద్ – పాయల్ శంకర్.. ఎమ్మెల్యే, పెద్దపల్లి – రమారావు పాటిల్.. ఎమ్మెల్యే, కరీంనగర్ – ధనపాల్ సూర్యనారాయణ గుప్తా.. ఎమ్మెల్యే, నిజామాబాద్ – ఏలేటి మహేశ్వరరెడ్డి.. ఎమ్మెల్యే, జహీరాబాద్ – కాటిపల్లి వెంకటరమణరెడ్డి... ఎమ్మెల్యే, మెదక్ – పాల్వాయి హరీష్ బాబు.. ఎమ్మెల్యే , మల్కాజ్గిరి – పైడి రాకేష్ రెడ్డి... ఎమ్మెల్యే, సికింద్రాబాద్ – కే.లక్ష్మణ్.. ఎంపీ , హైదరాబాద్ – రాజాసింగ్.. ఎమ్మెల్యే , చేవెళ్ళ – ఏవీఎన్ రెడ్డి.. ఎమ్మెల్సీ లకు బాధ్యతలు ఇచ్చారు. మహబూబ్‌నగర్ – రామచంద్ర రావు, నాగర్కర్నూల్ – మాగం రంగారెడ్డి, నల్లగొండ – చింతల రామచంద్రారెడ్డి, భువనగిరి – ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, వరంగల్ – మర్రి శశిధరరెడ్డి, మహబూబాబాద్ – గరికపాటి మోహన్ రావు. ఖమ్మం – పొంగులేటి సుధాకర్ రెడ్డి.



# వెరిఫికేషన్‌ను భట్టి..!

**మొదటిపేజీ తరువాయి..**

44 ,568 కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రజాపాలన సజావుగా జరిగేందుకు పది ఉమ్మడి జిల్లాలు, జీహెచ్ఎంసీ లోని అయిదు జోన్లకు ఒక్కొక్క సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక పర్యవేక్షణాధికారులుగా ప్రభుత్వం నియమించింది. ఈ ధరఖాస్తులన్నిటిని జనవరి 17వ తేదీ లోగా డేటా ఎంట్రీ ని పూర్తి చేయాలని సంబంధిత కలెక్టర్లను ఆదేశించారు.

**ప్రజాపాలన కోసం సబ్ కమిటీ**

తెలంగాణలో ప్రజాపాలన హామీల అమలు విషయంలో ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని నియమించింది. ఈ కేబినెట్ సబ్ కమిటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చైర్మన్ గా ఉండనున్నారు. ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉండనున్నారు. ఈ నెల 17వరకు అర్జీల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ముగియనుంది. అనంతరం దరఖాస్తుల్లోని వివరాల ఆధారంగా ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అనంతరం.. పథకాల అమలుకు అర్హులను ఎంపిక చేసి లబ్ధి చేకూర్చనున్నారు.

# ఒక్కటి చాలదా!

**మొదటిపేజీ తరువాయి..**

పదవులకు రాజీనామా చేశారు. ఇప్పుడు ఈ రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నిక కోసం వేరువేరుగా షెడ్యూల్ జారీ చేసింది ఎన్నికల కమిషన్. ఇదే అంశం ఇప్పుడు వివాదంగా మారింది. ఒకే ఎన్నిక నిర్వహించకుండా రెండు ఎన్నికలు నిర్వహించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్ కుమార్. గతంలో ఒకే రోజున ఒకే నోటిఫికేషన్ ద్వారా కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారని.. కానీ ఈ ఇద్దరి స్థానంలో కొత్త వారిని ఎన్నుకునేందుకు ఈసీ వేర్వేరుగా షెడ్యూల్ ఇవ్వడం ఎందుకన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు రెండు ఎన్నికలు నిర్వహించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి లబ్ధి చేకూరేలా ఉందన్నారు. గతంలో ఢిల్లీ, తమిళనాడు రాష్ట్రాల్లో ఇలాంటి సందర్భాలు ఉన్నాయని, తమ లేఖపై ఎన్నికల కమిషన్ ఏ విధంగా స్పందిస్తుందో చూడాలన్నారు.



# బిల్కినో కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు

**మొదటిపేజీ తరువాయి..**

చేసింది. ప్రభుత్వానికి క్షమాభిక్ష ఇచ్చే అధికారం లేదని స్పష్టం చేసింది. ఆ 11 మందిని 2 వారాల్లోగా జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ అనంతరం ఈ తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణ మహారాష్ట్రలో జరిగినందున.. దోషులకు రెమిషన్ మంజూరు చేసే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదని తెలిపింది. అలాగే, ఈ కేసులో రెమిషన్ కోరుతూ దోషి చేసిన విజ్ఞప్తిని పరిశీలించాలంటూ 2022 మార్చిలో సుప్రీంకోర్టు మరో బెంచ్ ఇచ్చిన ఆదేశాలపైనా తాజా ధర్మాసనం స్పందించింది. వాస్తవాలను దాచి, మోసపూరిత మార్గాల ద్వారా దోషి ఆ ఆదేశాలు పొందలేదని పేర్కొంది. గుజరాత్ లో 2002లో గోద్రా రైలు దహనకాండ అనంతరం చెలరేగిన అల్లర్లలో ఈ అత్యాచార ఘటన జరిగింది. దుండగులు బిల్కిస్ బానో కుటుంబానికి చెందిన ఏడుగురిని హత్య చేసి.. ఆ సమయంలో గర్భిణీ అయిన బానోపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో విచారణ అనంతరం 11 మంది నిందితులకు సీబీఐ ప్రత్యేక కోర్టు 2008, జనవరి 21న జీవిత ఖైదు విధించింది. బాంబే హైకోర్టు కూడా దీన్ని సమర్థించింది. దోషులు 15 ఏళ్లు కారాగారంలో శిక్ష అనుభవించారు. అనంతరం తమను విడుదల చేయాలంటూ ఓ నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అతని విజ్ఞప్తిని పరిశీలించాలని సర్వోన్నత న్యాయస్థానం గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ క్రమంలో ఓ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కేసులో నిందితులందరికీ రెమిషన్ మంజూరు చేయాలని కమిటీ సభ్యులు సర్కారుకు సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో 2022, ఆగస్ట్ 15న రిలీజ్ చేసింది. అయితే, గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ప్రతిపక్షాలు ఆందోళన చేశాయి. దోషులకు శిక్షను రద్దు చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. దోషుల్లో ఒకడైన రాధేషామ్ షా న్యాయవాద వృత్తిని కూడా ప్రారంభించాడు.దోషుల రిలీజ్ ను సవాల్ చేస్తూ బిల్కిస్ బానోతో పాటు మరికొంత మంది సుప్రీం కోర్టును ఆశ్రయించారు. వీటిపై విచారించిన సర్వోన్నత న్యాయస్థానం.. గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఈ కేసు విచారణ మహారాష్ట్రలో జరిగినందున మహారాష్ట్ర ప్రభుత్వ అధికారాలను.. గుజరాత్ ప్రభుత్వం అపహరించినట్లేనని న్యాయమూర్తి తెలిపారు. సర్కార్ ఇచ్చిన క్షమాభిక్షను రద్దు చేస్తున్నట్లు చెప్పారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# పాతబస్తీలో యువతిపై లైంగికదాడి



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** హైదరాబాద్ పాతబస్తీ బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తామని యువతిపై ఇద్దరు యువకుల అత్యాచారం జరిపారు. బాధిత యువతి బండ్లగూడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. సూర్యపేట కు చెందిన బాధితరు రాలు ఇంట్లో గొడవపడి రాత్రి బస్సు లో హైదరాబాద్ చేరుకుంది. రోడ్ పై నుండి వెళ్తుండగా ఇద్దరు యువకులు అపి వివరాలు అడగగా తనకి దెగ్గరలోని పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లాలని కోరింది. పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్తామని చెప్పిబైక్ పై కూర్చోబెట్టుకొని బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గోడౌన్ కు తీసుకెళ్లి ఇద్దరు అత్యాచారం చేరని ఫిర్యాదులో పేర్కొంది.

**మైనర్‌పై వృద్ధుడు లైంగికదాడి**

మేడ్చల్ : ఉప్పల్లో 16ఏళ్ల బాలికపై ఓ వృద్ధుడు అత్యాచారం జరిపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 3న ఉప్పల్ బస్ స్టాప్ లోబాలిక బస్సు ఎక్కేందుకు ఎదురుచూస్తుంది. తెలిసిన వాళ్ళలాగా ఇంటికి తీసుకెళ్తానంటూ మాయమాటలు చెప్పి సాదిక్ ఆ బాలికను తీసుకెళ్లాడు. అక్కడి నుంచి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం జరిపాడు. తరువాత ఆ బాలికను అక్కడే వదిలేసి పారిపోయాడు. సీసీ కెమెరాల ఆధారంగా అత్యాచారానికి పాల్పడిన 60 ఏళ్ల వృద్ధుడిని పోలీసులు గుర్తించి అరెస్టు చేసారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలపై కమలం గురి

- పట్టభద్రుల మండలి స్థానంపై నజర్
- పదవి దక్కించుకునేందుకు పక్కా ప్రణాళికలు
- డిగ్రీ విద్యార్థులను మచ్చిన చేసుకునే వ్యూహాలు

**వరంగల్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిశా-యి. త్వరలో పార్లమెంటు ఎన్నికలు జరుగనున్నాయి. మధ్యలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ సమాయత్తం అవుతుంది. పట్టభద్రుల స్థానాన్ని కైవసం చేసుకోవాలని కసరత్తు మొదలు పెట్టింది. పెద్ద ఎత్తున ఓటర్ నమోదు చేయించేందుకు ప్లాన్ చేస్తోంది. శాసన మండలి ఒకరికి మరొకరిని యాడ్ చేయాలని కమలనాథులు భావిస్తున్నారు. ఖమ్మం-నల్గొండ-వరంగల్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి, జనగామ శాసనసభ్యుడుగా ఎన్నికయ్యారు. దీంతో అయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ స్థానం ఖాళీ అయింది. ఆ స్థానానికి జూన్ 8లోపు ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది.ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్షన్ సంబంధించి కసరత్తు ప్రారంభించింది. ఓట్ల నమోదుకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసింది కేంద్ర ఎన్నికల సంఘం. ఫిబ్రవరి నెల ఆరవ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. పట్టభద్రుల నియోజకవర్గం లో ఓటు హక్కు వినియోగించుకోవాలనుకుంటే ఫ్రెష్‌గా ఓటరుగా నమోదు చేసుకోవాల్సిందే..! గతంలో ఉన్న ఓటర్ జాబితా పరిగణనంలోకి తీసుకోకుండా కొత్తగా ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవల్సిందే. ఈ నేపథ్యంలోనే మూడు జిల్లాల పరిధిలోని నియోజకవర్గంలో ఈసారి భారీ ఎత్తున ఓటర్ నమోదు జరిగే అవకాశం ఉంది. పోటీ చేయాలనుకునే ప్రధాన పార్టీలకు చెందిన నేతలు పెద్ద ఎత్తున ఓటర్ ఎన్-రోల్ చేయించేందుకు సిద్ధమవుతున్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేవారు సైతం ఓటర్ నమోదుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ముఖ్యంగా కమలం పార్టీ కూడా ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టబద్రుల స్థానాన్ని కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఈసారి భారీ స్థాయిలో ఓటర్ నమోదు చేసేందుకు ప్లాన్ చేస్తోంది. ఇప్పటికే పని కూడా ప్రారంభించింది. ఫామ్ 18 ఎక్కువ సంఖ్యలో ప్రింట్ చేయించి, పోలింగ్ బూత్ స్థాయి వరకు పంపించాలని డిసైడ్ అయింది. ప్రత్యేక టీమ్ లని పెట్టాలని అనుకుంటుంది.గత ఎన్నికల్లో చేసిన పొ-రపాట్లు చేయకుండా పకడ్బందీగా కార్యచరణ రూపొందిస్తోంది భారతీయ జనతా పార్టీ. తమకు పట్టు లేదని అంటున్న ఆ జిల్లాలలో తమకు పట్టు ఉందని నిరూపించుకోవాలని డిసైడ్ అయ్యింది. పార్లమెంట్ ఎన్నికల వేడిలో ఈ ఎన్నిక జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో తమకి అడ్వాంటేజ్ అవుతుందని పార్టీ నేతలు భావిస్తున్నారు.ఆ సీటుకు కూడా పార్టీ లో పోటీ ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ రెడ్డి ఆ సీట్ పై కన్నేశారు. తనకి ఇవ్వాలని ఇప్పటికే పార్టీ పెద్దలను కోరారట. ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రేమేందర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, పార్టీతో ఉన్న విద్యా సంస్థల అధినేతలు కూడా ఎమ్మెల్సీ బరిలోకి దిగేందుకు ప్లాన్ చేసుకుంటున్నట్లు సమాచారం. చూడాలి మరీ అధిష్టానం ఎవరికి అవకాశం కల్పిస్తుందో..!






# ముగ్గురికి ముగ్గురు! ఆపై మరో ఇద్దరు!!

- ఖమ్మం ఎంపీ టికెట్‌కు కాంగ్రెస్‌లో పోటాపోటీ
- తమ అనుయాయుల కోసం మంత్రులు ప్రయత్నాలు
- టికెట్ వేటలో రేణుకాచౌదరి, ఓ వ్యాపార వేత్త
- పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న నేతలు

**ఖమ్మం, ప్రభాతసూర్యుడు :** ఖమ్మం ఎంపీ టికెట్ హాట్ టాపిక్‌గా మారింది. అధికార పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థి ఎవరు.? అనే అంశంపై రాజకీయ పెద్దల నుంచి సాధారణ పౌరుల వరకు చర్చనీయాంశమవుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దుగా ఉన్న ఖమ్మం జిల్లా రాజకీయంగా ఎప్పుడూ వైవిధ్యతను కలిగి ఉంటుంది. మిక్స్ కల్చర్ గా కనిపించే ఖమ్మం జిల్లా రాజకీయాలు రెండు రాష్ట్రాల ప్రజల దృష్టిని ఆకర్షిస్తూ ఉంటాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే జరిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది నియోజకవర్గాలు ఉండగా తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయ కేతనం ఎగురవేసి గత అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టించింది. తాజాగా పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి ఎవరనే చర్చ సాగుతోంది. గత ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించిన నేపథ్యంలో ఎంపీ అభ్యర్థి గెలుపు ముందే నిశ్చయమైనట్లు చర్చ జరుగుతోంది. ఫలితంగా రోజుకో కొత్తముఖం తెరపైకొస్తోంది. ఈ క్రమంలో అసలు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరు అనేదానిపైనే ఉత్కంఠ నెలకొంది. ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ తరపున పోటీ చేసే ఆశావాహ అభ్యర్థుల సంఖ్య నానాటికీ పెరుగుతుంది. కాగా మొన్నటి ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసి మంత్రి పదవులు పొందిన అతిరథులు సైతం ఎంపీ టికెట్‌ను తమ వారికి ఇప్పించుకునేందుకు పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మధిర నియోజకవర్గం నుంచి గెలుపొందిన భట్టి విక్రమార్క రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పదవిని పొందారు. అలాగే మరో ఇద్దరు దిగ్గజాలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కీలకమైన రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖలు దక్కగా, తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ మంత్రిగా కొలువుదీరారు. అయితే ఈ ముగ్గురు నేతలు సైతం తమ అనుయాయులను ఎంపీ అభ్యర్థిగా నిలిపేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. భట్టి విక్రమార్క స-తీమణి మల్లు నందిని ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారన్న వార్తలు ఇటీవల హల్‌చల్ చేశా-యి. అలాగే సామాజిక మాధ్యమాల్లో, కొన్ని దిన పత్రికల్లో సైతం తుమ్మల నాగేశ్వరరావు కుమారుడు యుగంధర్ ఖమ్మం ఎంపీగా పోటీ పడుతున్నారని వార్తలు వచ్చాయి. ఇక మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి సైతం ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్నట్లు పలు పత్రికలు కథనాలను ప్రచురించాయి. గడిచిన రెండు, మూడు పర్యాయాల నుంచి ఎన్నికలు సమీపిస్తున్న ప్రతిసారీ ఆ వ్యాపారవేత్త పేరు తెరపైకి వస్తుంది. ఎన్నికలు ముగిశాక ఆ పేరు ఎక్కడా వినిపించదు. ఈసారి కూడా ఎంపీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఖమ్మం నగరానికి చెందిన ఓ ప్రముఖ వ్యాపారవేత్త పేరు ప్రచారంలోకి వచ్చింది. ఖమ్మం ఇన్చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇటీవల ఖమ్మం పర్యటనకు వచ్చిన సమయంలో ఆయనతో కలిసి సదరు వ్యాపారవేత్త హెలికాప్టర్‌లో దిగడం రాజకీయ చర్చకు దారి తీసింది. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో సాన్నిహిత్యం కొనసాగించిన ఆ వ్యాపారవేత్త మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో వెనువెంటనే తన ప్లేట్ మార్చివేశారు. ఖమ్మం నగరంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ మంత్రులతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వైనం చర్చకు కార-ణమైంది. కాంగ్రెస్ తరపున పోటీ పడేందుకు కొత్త ముఖాలు తెరపైకి వస్తుండగా ఇక్కడ ఎంపీగా గెలుపొంది కేంద్ర మంత్రి పదవిని సైతం అలంకరించిన మాజీ మంత్రి రేణుకా చౌదరి పరిస్థితి ఏంటన్న చర్చ కూడా జరుగుతుంది. ఖమ్మం ఆడపడుచుగా చెప్పుకునే రేణుకా చౌదరి చాలా ఏళ్లుగా ఖమ్మం కేంద్రంగా రాజకీయాలు నెరిపారు. తాజాగా ఆమె సైతం మరోసారి ఖమ్మం నుంచి పోటీ చేసేందుకు టికెట్ కోసం ఢిల్లీ స్థాయిలో పావులు కదుపుతున్నట్లు స్పష్టమవుతుంది. 2019 ఎన్నికల్లో రేణుక ప్రస్తుత బీఆర్ఎస్ ఎంపీ నామ నాగేశ్వరరావు చేతిలో పరాజయం పొందారు. ఈసారి రాష్ట్రం అంతటా కాంగ్రెస్ హవా కొనసాగుతున్న నేపథ్యంలో ఆమె ఖమ్మం టికెట్ కోసం అధిష్టానం వద్ద గట్టి పట్టు పట్టే అవకాశం కనిపిస్తోంది. ఇలా మాజీ మంత్రి రేణుక తో పాటు తాజా మంత్రుల అనుయాయులు, వ్యాపారవేత్తలు సైతం ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీపడేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఇంతటి పోటీ నేపథ్యంలో అసలు అధిష్టానం మదిలో ఎవరు ఉన్నారన్నదే వేచి చూడాల్సిన అంశంగా మారింది.

# నల్లగొండలో నెగ్గిన అవిశ్వాసం

మొదటిపేజీ తరువాయి..

9 మంది కౌన్సిలర్లు, ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరిన మరో ఆరుగురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు పెట్టి తీర్మానం నెగ్గింది. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్లలో ఒకరిని ఛైర్మన్‌గా ఎన్నుకునే అవకాశం ఉంది.జిల్లా కేంద్రమైన నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో ఉత్కంఠగా అవిశ్వాస తీర్మానం కొనసాగింది. మున్సిపల్ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్ సమక్షంలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. కాంగ్రెస్ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 41 ఓట్లు, వ్యతిరేకంగా బీఆర్ఎస్‌కు ఐదు ఓట్లు వచ్చాయి. ఒకరు తటస్థంగా ఉండగా, మిగిలిన సభ్యులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. 2019లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నల్గొండలో మొత్తం 48 వార్డులకు గాను 20 వార్డులు కాంగ్రెస్, 20 వార్డులు బీఆర్ఎస్ , 6 వార్డులు బీజేపీ, ఒక్కొక్కటి ఎంఐఎం, స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు.బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యుడు తమకు లభించిన అవకాశాన్ని వినియోగించుకుని నల్గొండ మున్సిపాలిటీలో ఎక్స్ అఫీషియో సభ్యులుగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. దీంతో మున్సిపల్ ఛైర్మన్ గా బీఆర్ఎస్ కౌన్సిలర్ మందడి సైదిరెడ్డి ఎన్నికయ్యారు. మూడు నెలల క్రితం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ అబ్బగోని రమేష్ సహా 12 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు.మరోవైపు నల్లగొండ నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గెలుపొందడంతో మున్సిపాలిటీలో రాజకీయాలు అవిశ్వాస తీర్మానం వైపు మళ్లాయి. మున్సిపాలిటిలో కౌన్సిలర్ల చేరికలు ఎక్కువ కావడంతో కాంగ్రెస్ బలం 34కు చేరింది. వీరంతా కలిసి ఛైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించారు. ఎక్స్ అఫీషియో ఓటు వినియోగించకుండానే అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అయితే బీఆర్ఎస్ విప్ జారీ చేసిన నేపథ్యంలో ఆ పార్టీ నుంచి గెలిచిన 15 మంది కౌన్సిలర్లకు పదవీ గండం ఏర్పడనుంది.

**కోదాడ బిఆర్ఎస్ ఎంపీపీ రాజీనామా**

సూర్యాపేట జిల్లా కోదాడ ఎంపీపీ చింత కవితారెడ్డి తన ఎంపిపి పదవికి రాజీనామా చేశారు...రాజీనామా లేఖను జిల్లా సీఈవో సురేష్ కుమార్ కు అందజేశారు.. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కు ప్రధాన అనుచరురాలుగా ఉన్న ఎంపీపీ కవితపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని గతంలోనే కలెక్టర్ కి ఎంపీటీసీలు దరఖాస్తు చేశారు. దీంతో ఈనెల 17న అవిశ్వాసం తీర్మానం ఉండటంతో ఎలాగు అవిశ్వాసంలో నెగ్గే పరిస్థితి లేకపోవడంతో ఎంపీపీ కవిత రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

# ఇది ప్రభుత్వ స్థలం!

మొదటిపేజీ తరువాయి..

నియోజకవర్గంలో ఎంతో విలువైన అనేక భూములు ఇలా బీఆర్ఎస్ పెద్దలు కబ్జా చేసి పాగా వేసినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి.ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కబ్జాలపై ప్రధానంగా దృష్టి సారించింది. “తప్పు చేసిన వారే సరిదిద్దండి.. జరిగిన తప్పు నా దృష్టికి వచ్చే వరకూ చేసుకోకండి..” అంటూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇచ్చిన స్వీట్ వార్నింగ్ తో అధికార యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచింది. దీంతో 58, 59 జీవో కింద అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్ ల వ్యవహారంపై అధికారులు పోస్టుమార్టం మొదలు పెట్టారు. వాస్తవానికి ఈ జీవో నిబంధన ప్రకారం గతంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టి ఉండాలి. సదరు నిర్మాణంలో యజమానిగా చెప్పుకునే వ్యక్తులు నివాసం ఏర్పాటు చేసుకుని ఉండాలి. ఇలాంటి నిర్మాణాలను మాత్రమే ఈ జీవో కింద క్రమబద్ధీకరిస్తారు. కాగా ఎలాంటి నిర్మాణాలు లేకపోయినా ఖాళీ స్థలాల్లోనే అక్రమంగా ఇంటి నెంబర్లు, విద్యుత్ మీటరు కనెక్షన్ నెంబర్లను రూపొందించి 59 జీవో కింద దరఖాస్తు చేసుకున్న వైనం వెలుగు చూస్తోంది. అధికారుల్లో కొందరు లంచాలకు మరిగి ఇలాంటి భూములను చూసి చూడనట్లు రిజిస్ట్రేషన్ చేస్తున్న పరిస్థితితో ఖమ్మంలో విలువైన ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయి.ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు జారీ చేసిన జీవో నెం. 59 జీవో క్రింద నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి నిర్మాణాలు లేకున్నా దరఖాస్తు చేసి అక్రమంగా క్రమబద్ధీకరణ కోసం ప్రయత్నం చేసిన స్థలాలు గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం అర్బన్ పరిధిలోని ఖానాపురం సర్వే నెం. 272 లో 300 గజాల ప్లాట్, ఖానాపురం డొంకలో 200 గజాల రెండు ప్లాట్లు, 150 గజాల ఒక ప్లాట్, వెలుగుమట్ల సర్వే నెం. 412లో 300 గజాల ఒక ప్లాట్ లలో ఎలాంటి నిర్మాణాలు లేకున్నా పలువురు జీవో 59 కింద దరఖాస్తు చేశారని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అలాంటి దరఖాస్తులను తిర-స్కరించామన్నారు. సుమారు రూ. 4.35 కోట్ల విలువైన ఈ స్థలాలను రెవెన్యూ, మునిసిపల్ అధికారులు స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని వివరించారు. అదేవిధంగా భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది నిఘా పెట్టి, ఎలాంటి ఆక్రమణలు జరగకుండా, నిర్మాణాలు చేపట్టకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## కాంగ్రెస్ ప్రభుత్వానికి 30 రోజులు



### ఓయూలో సంబరాలు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** ప్రజా పాలనకు కేసిఆర్ పాలనకు చాలా తేడా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ముప్పై రోజులు అయిన సందర్భంగా చనగాని దయాకర్ అధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద కేక్ కట్ చేసి విద్యార్థులు, నిరుద్యోగులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి జనరల్ సెక్రటరీ బాలలక్ష్మి, ఎన్ ఎస్ యూ ఐ విద్యార్థి నాయకుడు మేడ శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజాపాలన 30 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులకు ఎమ్మెల్యేలకు ఓయూ ఆర్ట్స్ కళాశాల వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఒక స్వేచ్ఛా,సమానత్వం,స్వయంపాలన ఒక కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అనేది ఈ ముప్పై రోజుల్లోనే నిరూపించుకున్నారు. ఈ ముప్పై రోజుల్లోనే అనేక సంస్కరణలు జరిగాయి,గత ప్రభుత్వం పోరాడే హక్కును కాలరాసింది. ఈ ముప్పై రోజులు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ముఖ్యమంత్రి,మంత్రులు అహర్నిశలు కృషి చేస్తున్నారు.

# సంపాదకీయమ్..

## ముందున్నది మొసళ్ల పండుగ

ఛాయ్ తాగడం. సమోసాలు తినడం తప్ప ఆ కూటమి నేతలు చేసేదేమీ లేదు" అని ఆ మధ్య ఓ కీలక నేత ఇండియా కూటమిపై ఇలా సెటైర్లు వేశారు. పొలిటికల్ కామెంట్స్ ఇలానే ఉంటాయని అనుకున్నా...నిజంగా జరుగుతోంది అదే కావచ్చు అనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు మరెన్నో నెలల సమయం లేదు. ఇప్పటి నుంచే యాక్టివ్ అయితే తప్ప మోదీ సర్కార్‌ని ఢీకొట్టడం సాధ్యం కాదు. అసలు ఈ పాటికే గ్రౌండ్ అంతా ప్రిపేర్ చేసుకోవాలి. కానీ...ప్రతిపక్షాలు మాత్రం ఇంకా "ఏం చేద్దాం" అనే దగ్గరే ఆగిపోయినట్టు కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో కచ్చితంగా తమ ప్రభావం చూపించాలను కుంటున్న పార్టీలన్నీ ఒక్కతాటిపైకి వచ్చాయి సరే...మరి తరవాతి సంగతేంటి..? ఇప్పటికి నాలుగైదు సార్లు సమావేశమయ్యారు. కానీ ఇప్పటి వరకూ కూటమి నుంచి అధికారికంగా "ఇదీ మా ప్రణాళిక" అన్న ప్రకటన రాలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తప్ప మిగతా ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించినట్టే కనిపించడం లేదు. కూటమిలో అంతా బాగానే ఉండుంటే ఈ పాటికి సీట్‌ల షేరింగ్ విషయంలో ఓ స్పష్టత వచ్చుండేది. ఇక్కడే పార్టీల మధ్య విభేదాలు మొదలయ్యాయి. సైద్ధాంతిక విభేదాలున్న తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలు కలవడం అంటే అదో వింతే. అప్పట్లో బెంగాల్‌లో పంచాయతీ ఎన్నికలు జరిగినప్పుడు ఈ రెండు పార్టీల మధ్య ఎన్ని విభేదాలు తలెత్తాయో తెలియంది కాదు. కానీ కూటమి ఈ రెండు పార్టీలనూ ఒక్క చోటకు చేర్చింది. అది ఆ దశకే పరిమితమైంది. సీట్‌ల పంపకాల విషయంలో చిక్కులు వీడడం లేదు. కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి ఇటీవల బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కాస్త గట్టిగానే విమర్శలు చేశారు. "ఆమె మోదీకి సేవలు చేయడంలోనే సరిపోతున్నట్టుంది" అంటూ మండి పడ్డారు. అసలే ఉప్పు నిప్పు లాంటి పార్టీలు...చివరకి వరకూ ఎలా కలిసి ఉంటాయన్న అనుమానాలకు ఈ విభేదాలు మరింత బలం చేకూర్చుతున్నాయి. ఇక్కడే మరో విషయమూ చెప్పుకోవాలి. "మాపై మీరు జాలి చూపించాల్సిన అవసరం లేదు" అని మమతా బెనర్జీపై కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి నేరుగానే విమర్శలు చేశారు. అంతే కాదు. సొంతగా పోటీ చేసి కూడా గెలిచి చూపిస్తాం అని తేల్చి చెప్పారు. అంటే...బెంగాల్‌లో సీట్‌ల పంపకాల్లో తేడాలు వస్తున్నట్టేగా. ఇక్కడొక్కచోటే కాదు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్‌లోనూ సీట్‌ల పంపకాల సమస్యని తేల్చడం అంత సులభమేమీ కాదు. మహారాష్ట్ర, బిహార్, యూపీ, వెస్ట్ బెంగాల్, పంజాబ్‌లో సీట్ షేరింగ్ విషయంలో చాలా ఆచితూచి వ్యవహరించాలని చూస్తోంది కాంగ్రెస్. అదే సమయంలో స్థానిక పార్టీలకు ఎక్కువ సీట్‌లు ఇచ్చేందుకు మాత్రం ఆసక్తి చూపించడం లేదు. ఈ డబుల్ గేమ్ వల్లే ఈ సమస్య కొలిక్కి రావడం లేదు. యూపీలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలున్నాయి. అందులో కనీస 15-20 సీట్లలో పోటీ చేయాలని చూస్తోంది కాంగ్రెస్. మహారాష్ట్రలో 48 ఉండగా అందులో 16-20 స్థానాల్లో, పశ్చిమ బెంగాల్‌లో 6-10 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. ఇది విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారం మాత్రమే. ఈ లెక్క పెరగొచ్చు కూడా. కానీ...తగ్గే అవకాశాలైతే కనిపించడం లేదు. ఆ మాత్రం స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టకపోతే అసలు తాము పోటీ చేసి ఏం లాభం అనే వైఖరితో ఉంది కాంగ్రెస్. కానీ 2019 నాటి ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక పార్టీలు కాంగ్రెస్‌కి అన్ని సీట్లు ఇచ్చేందుకు ముందుకు వస్తాయా లేదా అన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న. యూపీలో మాత్రం సమాజ్‌వాదీ పార్టీతో పెద్దగా విభేదాలైతే లేవు. ఒకవేళ అఖిలేష్ యాదవ్ ఒప్పుకుంటే యూపీలో కాంగ్రెస్‌కి పెద్దగా సవాళ్లు ఏమీ ఎదురుకాకపోవచ్చు. సీట్‌ల పంపకాలూ తొందరగానే పూర్తవుతాయి. కాంగ్రెస్‌కి ఉన్న సమస్యల్లా బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లోనే. బిహార్‌లో ఆర్జేడీ జేడీయూ లాంటి స్థానిక పార్టీలదే హవా. తమకు బలం ఉన్న నియోజకవర్గాలను వదులుకుని కాంగ్రెస్‌కి ఛాన్స్ ఇస్తాయా అన్నది అంతు తేలని ప్రశ్న. అయినా కాంగ్రెస్ కోసం మేమెందుకు త్యాగం చేయాలన్న ఆలోచన వాళ్లలో వచ్చిందంటే హస్తం పార్టీకి చివరకు నాలుగైదు సీట్ల కన్నా ఎక్కువగా మిగలవు. అక్కడే పోటీ చేయాల్సి ఉంటుంది. ఇందుకు కాంగ్రెస్ ఒప్పుకోకపోవచ్చు. అటు మహారాష్ట్రలోనూ ఉద్ధవ్ థాక్రే శివసేన పార్టీకి, కాంగ్రెస్‌కి అసలు పొసగడం లేదు. కచ్చితంగా 20 సీట్లలో అయినా పోటీ చేస్తామని శివసేన మొండి పట్టుపడుతోంది. కాంగ్రెస్ కూడా దాదాపుగా అదే కోరుకుంటోంది. కానీ ఎవరి లెక్కలు వాళ్లకుంటాయిగా. పైగా అన్ని స్థానిక పార్టీలూ ఈ లోక్‌సభ ఎన్నికలని చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. తనకు మాలిన ధర్మం ఎందుకన్న ధోరణిలోనే ఆలోచిస్తున్నాయి. పైగా కాంగ్రెస్‌కి సీట్‌లు ఇవ్వాలంటే గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం ఎంత ఉందో అన్న లెక్కలు తీస్తున్నాయి. ఈ లెక్కల ఆధారంగా చూస్తే కాంగ్రెస్‌కి తక్కువ సీట్‌లే కేటాయించే అవకాశాలున్నాయి. ఖర్గే ఒక్కరే కాస్త ముందు పడి ఈ సీట్‌ల లెక్కల్ని తేల్చేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు కానీ...కాంగ్రెస్‌లో మిగతా నేతలెవరూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. అటు ఆమ్ ఆద్మీ పార్టీతోనూ విభేదాలు పక్కన పెట్టి కలిసి నడవడం అంత సులువేమీ కాదు. పంజాబ్‌లో ప్రస్తుతం ఆప్ ప్రభుత్వమే ఉంది. ఇక్కడ కాంగ్రెస్‌కి మంచి క్యాడర్ ఉంది. అందుకే ఇక్కడ ఎక్కువ సీట్‌లలో పోటీ చేయాలని ఆశ పడుతోంది. కానీ...ఇప్పటికే అధికారంలో ఉన్న ఆప్ ఆ అవకాశం ఇస్తుందా అన్నది స్పష్టత లేదు. మరో 15-20 రోజుల్లో అంతా సెటిల్ చేసేస్తాం అని ఖర్గే చాలా ధీమాగా చెబుతున్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ ఇన్ని సమస్యలు ఎదురవుతుంటే ఖర్గే ఏ కాన్ఫిడెన్స్‌తో అలా చెబుతున్నారన్నది ఆసక్తికర విషయం. అలా అని ఆయనను తక్కువ అంచనా వేయడానికీ వీల్లేదు. కొన్ని చోట్ల తగ్గినా సరే..కూటమిగా నిలబడడం మంచిదనే ఆలోచనలో ఉన్నారేమో. ఎందుకంటే...కూటమిలో లుకలుకలు మొదలైతే ముందుగా ఆ అపవాదు మూటగట్టుకోవాల్సింది కాంగ్రెస్ పార్టీయే.

# కవ్వాల్ ఖాళీ!



- పులుల కోసం గ్రామాలు తరలింపు
- టైగర్ జోన్ నుంచి దూరంగా ప్రజలు
- పునరావాస వసతుల కల్పనలో అధికారులు

**ఆదిలాబాద్, ప్రభాతసూర్యుడు :**
కవ్వాల్ టైగర్ రిజర్వు నుంచి గ్రామాల తరలింపునకు రంగం సిద్ధమైంది. నిర్మల్ జిల్లా కడెం మండలం మైసంపేట, రాంపూర్ గ్రామాలను కోర్ ఏరియా వెలుపల ఉన్న ఇదే మండలంలోని ధర్మాజిపేటకు ప్రజలను తరలించనున్నారు. ధర్మాజిపేటలోనే వారికి పునరావాసం కల్పించనుండగా.. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం ఇప్పటికే దాదాపు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. అలాగే మైసంపేట, రాంపూర్ వాసుల్ని రాష్ట్ర ప్రభుత్వం తేదీ నిర్ణయించగానే నెల రోజుల్లోగా వారందరినీ ధర్మాజిపేటకు తరలించనున్నట్లు అటవీశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే కవ్వాల్ నుంచి మరికొన్ని గ్రామాలను, అమ్రాబాద్ టైగర్ రిజర్వులోని పలు గ్రామాలను తరలించేందుకు అటవీశాఖ కసరత్తు చేస్తోంది. పెద్దపులులు కోసం గ్రామాల్ని రీలొకేషన్ చేయడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే తొలిసారి. పెద్దపులులు స్థిర నివాసం ఏర్పరచుకోవడం, వాటి సంచారానికి ఆటంకం కలగకుండా ఉండేందుకు అటవీశాఖ కొద్ది సంవత్సరాలుగా చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి వచ్చాయి. కవ్వాల్ కోర్ ఏరియాలో 37 గ్రామాలుండగా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన మైసంపేట, రాంపూర్ గ్రామాల్ని తొలిదశలో రీలొకేషన్‌కు తీసుకున్నారు. ధర్మాజిపేట కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధిలోనే ఉన్నా.. ఈ ప్రాంతం పెద్దపులులు ప్రధానంగా సంచరించే కోర్ ఏరియాకు వెలుపల ఉంటుంది. ఆ రెండు గ్రామాలకు దాదాపు 25 కి.మీ.ల దూరం. అయితే రక్షిత అటవీప్రాంతం కావడంతో 276.50 ఎకరాల అటవీప్రాంతాన్ని డీనోటిఫై చేశారు. అందులో 6.88 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 5.48 ఎకరాలు సామాజిక అవసరాలకు, 264.14 ఎకరాలను వ్యవసాయభూమిగా పంచేందుకు కేటాయించారు. సామాజిక అవసరాల్లో భాగంగా కమ్యూనిటీ సెంటర్, అంగన్వాడీ కేంద్రం, వాటర్‌ట్యాంకు, అంతర్గత రహదారులు వంటి సదుపాయాలను కల్పిస్తున్నట్లు అటవీ శాఖ వర్గాలు పేర్కొన్నాయి.కవ్వాల్ కోర్ ఏరియాకు పెద్దపులులు వస్తున్నా జన సంచారం వంటి కారణాలతో కొద్దికాలానికే వెనక్కి వెళుతున్నాయి. మహారాష్ట్ర నుంచి కవ్వాల్ కోర్ ఏరియాకు వచ్చే మార్గమైన కారిడార్ ప్రాంతంలో 8-10 పులులు సంచరిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కోర్ ఏరియా నుంచి గ్రామాల తరలింపు ప్రక్రియ చేపట్టారు. 'మైసంపేట, రాంపూర్ గ్రామాల్ని ఖాళీ చేయించాక ఆ ప్రాంతాన్ని గడ్డిభూములుగా, నీటి వనరులుగా అభివృద్ధి చేస్తాం. దీంతో అక్కడ జింకలు వంటి శాకాహార జంతువులు పెరుగుతాయి. వీటిని వేటాడి ఆకలి తీర్చుకుంటూ పులులు ఇక్కడ స్థిరపడేందుకు అవకాశాలు మెరుగుపడతాయి' అని అటవీ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో 26 పెద్దపులులు ఉన్నట్లు సమాచారం. ఇక్కడ పెద్దపులులు స్వేచ్ఛగా సంచరించేందుకు వీలుగా కోర్ నుంచి తరలించేందుకు 8 గ్రామాలు, చెంచుపెంటలను అటవీశాఖ గుర్తించింది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని ఫర్హాబాద్‌పెంట, కొల్లంపెంట, కుడిచింతలబైలు, సార్లపల్లి గ్రామాల్లో సామాజిక, ఆర్థిక సర్వే చేశారు.
ఇక్కడ 380 కుటుంబాలు న్నట్లు గుర్తించామని వెల్లడించారు. ఇక ప్రాజెక్టు వ్య యం రూ.24.10 కోట్లు అవుతున్నట్లు ప్రకటించగా.. 2 గ్రామాల్లో 142 కుటుంబాలున్నాయని, ఇప్పటికే 48 కుటుంబాలకు ఆప్షన్-1 (పునరావాసం లేకుండా కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం) ఇవ్వగా, 94 కుటుంబాలు ఆప్షన్-2 (ఇంటి నిర్మాణంతో పాటు కుటుంబానికి 2.81 ఎకరాల భూమి) అందించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

# పాలమూరు జిల్లా నేతల్లో ఆవేదన.. ఆనందం

**మహబూబ్ నగర్, ప్రభాతసూర్యుడు :**
ఎన్నికల ముందు నాటి అధికార బీఆర్ఎస్ లో చేరిన నేతలు నేడు ఆందోళనలో మునిగిపోయారు. అభ్యర్థుల ప్రకటన, ఇతర అవకాశాల కోసం కాంగ్రెస్, బీజేపీని వీడి బీఆర్ఎస్‌లో చేరితే ఎన్నికల తీర్పు అవాక్కయ్యేలా చేసింది. ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉన్నవాళ్లు అధికార పార్టీలోకి వెళ్లి తాజాగా మళ్లీ ప్రతిపక్షంలో పడిపోయారు. నాడు అధికారంలో ఉన్నవాళ్లు ప్రతిపక్షంలోకి వెళ్లి మళ్లీ అధికారంలోకి వెళ్లారు. ఎన్నికల పండుగ ముగిసింది. కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఇక ఎన్నికల ముందు నేతలు తీసుకున్న నిర్ణయాలు కొంతమందిని ముందుకు నడిపిస్తే మరికొంత మందిని అగాథంలో పడేసాయి. టికెట్ దక్కలేదని కొందరు, రాజకీయ అవకాశాల కోసం మరికొందరు వివిధ పార్టీలను వదిలి బీఆర్ఎస్‌లో చేరారు. అయితే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను కాదనీ కాంగ్రెస్‌కు పట్టం కట్టడంతో పార్టీ మారిన నేతలు ఇప్పుడు ఆందోళనలో మునిగిపోయారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ముఖ్యనేతలు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. ఎన్నికల వరకు కాంగ్రెస్‌లో పనిచేసి.. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తుందనుకున్న బీఆర్ఎస్‌లో చేరితే పరిస్థితి తారుమారయ్యిందని అయోమయోంలో పడ్డారు. నాడు పదేళ్ల పాటు ప్రతిపక్షానికి పరిమితమై.. ఇప్పుడు కూడా మళ్లీ ప్రతిపక్షంలో చేరామన్న ఫీలింగ్‌లో ఉన్నారట నేతలు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఉమ్మడి పాలమూరు జిల్లాలో అన్ని పార్టీల్లోకి నేతల వలసలు కొనసాగాయి. ముఖ్యంగా కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి పలువురు



కీలక నేతలు జంప్ అయ్యారు. రాజకీయ కురువృద్ధుడు నాగం జనార్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, టీడీపీ సీనియర్ నేత రావుల చంద్రశేఖర్ రెడ్డి, మరికొంతమంది ఓ స్థాయి పట్టున్న నేతలు కారెక్కారు. కాంగ్రెస్‌లో అసంతృప్తిని ఆసరా చేసుకొని వీరందరిని గులాబీ పార్టీ చేర్చుకుంది. ఎంతో కొంత ఓటు బ్యాంకు అభ్యర్థులకు కలసివస్తుందని భావించి.. అధికారంలోకి వచ్చాక తగిన అవకాశాలు కల్పిస్తామని హామీ సైతం ఇచ్చింది బీఆర్ఎస్ అధిష్టానం. కుమారుడి రాజకీయ భవిష్యత్, కాంగ్రెస్‌లో చేరిన కూచుకుళ్ల కుటుంబంపై కోపంతో నాగం జనార్ధన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు.అధికారంలోకి వస్తే కుమారుడి రాజకీయ భవిష్యత్‌కు బాటలు వేసే అవకాశం వస్తుందని భావించారు. ఇక మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ కాంగ్రెస్ పార్టీ నుంచి జడ్చర్ల, నారాయణపేటలో ఏదో ఒక టికెట్ వస్తుందని ఆశించి భంగపడ్డారు. దీంతో ఆయన అసంతృప్తిని బీఆర్ఎస్ అక్కున చేర్చుకొని పార్టీలో చేర్చుకుంది. మరోవైపు బీజేపీలో కొనసాగుతున్న మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ సైతం కమలం వీడి గులాబీలో చేరాడు. వీరితో పాటు పలువురు మైనారిటీ నేతలు సైతం మళ్లీ అధికారంలోకి బీఆర్ఎస్ వస్తుందన్న భావనతో గులాబీతీర్థం పుచ్చుకున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. అందులో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 14సీట్లకు గాను 12సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకొని తుఫాన్ సృష్టించింది. అయితే ఈ తుఫాన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులే కాదు ఎన్నికల ముందు కొండంత ఆశతో పార్టీ మారిన నేతలు సైతం గల్లంతయ్యారు. నాడు ప్రతిపక్షంలోనే ఉండి.. నేడు ప్రతిపక్షానికే పరిమతమయ్యామనే బాధలో ఉన్నారట. ఇప్పటికిప్పుడు భవిష్యత్‌పై ఎలాంటి ఆలోచన చేయని నేతలు పార్టీ ఓటమిపైనే మథనపడుతున్నారట. కొంతమంది నేతలు అయితే పార్టీ మారడం తప్పుడు నిర్ణయమేమో అన్న అభిప్రాయాన్ని అనుచరుల వద్ద ప్రస్తావించారట. బీఆర్ఎస్‌లో చేరిన వారి పరిస్థితి ఇలా ఉంటే కాంగ్రెస్‌లో చేరిన వారికి మాత్రం అదృష్టం వరించిందనే చెప్పుకోవచ్చు. ఎన్నికలకు అటు ఇటుగా పార్టీ మారీ కాంగ్రెస్ టికెట్ సంపాదించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి, తుడి మోఘారెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి ఎన్నికల్లో విజయం సాధించి సంతోషంలో ఉన్నారు. టికెట్ ఆశించి భంగపడిన మరికొంత మంది నేతలు బుజ్జగింపులకు తలొగ్గి పార్టీ విజయం కోసం పనిచేశారు. అలాంటివారికి నామినేటెడ్ అవకాశాలు కల్పిస్తామని పార్టీ అధిష్టానం ప్రకటించడంతో వారు సైతం ఏదో ఒక ఛాన్స్ వస్తుందనే ఆనందంలో ఉన్నారు. ఏది ఏమైనా పాలమూరు పాలిటిక్స్ చూస్తుంటే ఓడలు బండ్లవుతాయి, బండ్లు ఓడలవుతాయని మరోసారి రుజువు చేస్తున్నాయి.

# మద్యం మత్తులో మాజీ మంత్రి మేనల్లుడి వీరంగం

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
కూకట్‌పల్లిలోని కేపీహెచ్‌బీ కాలనీ ఫోరం మాల్ సర్కిల్ వద్ద సోమవారం తెల్లవారుజామున ఓ కారు బీభత్సం సృష్టించింది. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మేనల్లుడు అగ్రజ్ ఫుల్లుగా మద్యం సేవించి నలుగురు స్నేహితులతో కలిసి కారు నడిపి హల్ చల్ చేశాడు. ఈ క్రమంలో రాంగ్ రూట్ లో కారును నడిపి ఓ బైక్ ను ఢీకొట్టగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని గుర్తించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు అగ్రజ్ ను అరెస్ట్ చేసి బ్రీత్ అనలైజర్ పరీక్ష చేశారు. అందులో 90 శాతం ఆల్కహాల్ సేవించినట్లుగా తేలింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. అగ్రజ్ సహచరులపైనా కేసు నమోదైంది. బాధితులు సేల్స్ మ్యాన్ బన్వరీలాల్ (24), మరో వ్యక్తి ధురుచంద్ (33)గా గుర్తించారు.మరోవైపు, నగరంలోని బాలనగర్ లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఐడీపీఎల్ చౌరస్తా డీ మార్ట్ వద్ద వేగంగా దూసుకొచ్చిన బైక్ డీసీఎం వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న అఖిల్ (23) అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారుఅటు, శంషాబాద్ ఎయిర్ పోర్టులో మందుబాబులు సోమవారం వీరంగం సృష్టించారు. నగరానికి చెందిన నలుగురు వ్యక్తులు ఎయిర్ పోర్టులోని ఏరో ప్లాజా బార్ లో ఫుల్లుగా మద్యం సేవించి పార్కింగ్ ప్లేస్ వద్ద హల్ చల్ చేశారు. సిబ్బందిపై దాడి చేశారు. అనంతరం పారిపోయేందుకు యత్నిస్తుండగా సీఐఎస్ఎఫ్ సిబ్బంది బారికేడ్లు అడ్డు పెట్టి అడ్డుకున్నారు. కారులో ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకోగా మరికొంతమంది పరారయ్యారు. పట్టుబడిన నిందితులను



శంషాబాద్ పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అయోధ్యకు వెళ్తా : చిరంజీవి



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** రామ మందిర నిర్మాణం చరిత్రలో నిలిచిపోయే ఘట్టం. రామ మందిరం ప్రారంభోత్సవానికి నాకు ఆహ్వానం అందిందని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. ఈ నెల 22న మా కుటుంబం రామ మందిర ప్రారంభోత్సవానికి వెళ్తున్నాం. రామ మందిర ప్రారంభోత్సం వేళ హనుమాన్ చిత్ర బృందం కీలక ప్రకటన చేసింది. తమ సినిమాకు వచ్చే వసూళ్లలో ప్రతి టికెట్‌పై రూ.5 రామ మందిర నిర్మాణానికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. హనుమాన్ చిత్ర బృంద నిర్ణయాన్ని మెగాస్టార్ చిరంజీవి ప్రకటించారు. స్వామి కార్యం కోసం మంచి నిర్ణయాన్ని తీసుకున్న హనుమాన్ చిత్ర బృందాన్ని చిరంజీవి అభినందించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215